

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 209 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం, 29, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# రిటైర్డు అధికారులు.. రాజ్యమేలుతున్నారు!



- పదవి కాలం ముగిసిన ముఖ్య విభాగాలను శాసిస్తున్నారు
- విద్య, వైద్య రంగాల్లో అంతా వాళ్లే
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న కాల పరిమితులు ఉత్తవేన
- పదవి విరమణ పొందిన అధికారులకు చెక్ పవర్ కట్టబెడుతున్నారు
- ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల్లో తిష్ట వేసిన రిటైర్డ్ అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా ఒకరిద్దరు మినహాయిస్తే అందరూ స్వార్థపూరిత అనర్హులే
- ప్రభుత్వం అనుకూలత కోసం వ్యవస్థలను నాశనం చేస్తే ఎలా
- ఉపాధ్యాయులు తప్ప అందరూ ప్రభుత్వ వ్యవస్థలతో ఆడుకుంటున్నారు
- పదవి అంటే వ్యామోహమా పైస సంపాదనకు పనిముట్టా
- ప్రభుత్వాలను జోకితే ఎలాంటి పదవులైనా కట్టబెడతారా

డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత అధికారుల పదవులకు డోకా లేదని డాక్టర్ బరిగెల శివ అన్నారు.ప్రభుత్వాలు ఏవైనా పదవి బాధ్యతలను తీసుకోవడానికి ఉన్నత అధికారులకు ఉద్యోగ వయోపరిమితి ఉద్యోగ పదవీ విరమణతో ఏమాత్రం సంబంధాలు లేకుండా కేవలం ప్రభుత్వాలతో అనుకూలంగా ఉంటే ముఖ్యమైన పదవులు వాటంతట అవే వస్తాయని తెలపడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అధికార దుర్వినియోగ పరిపాలన నియమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల విధులను అసంఘటిత పరుస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ పరిపాలన నిజాయితీగా, సజావుగా జరగాలంటే పదవీకాలంలో ఉన్న ముఖ్య అధికారులతో ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహింపజేస్తు సర్వీసులలో ఉన్న అధికారులకు బాధ్యతలను అప్పగిస్తూ కొనసాగించాలని పేర్కొన్నారు.దానికి పూర్తి భిన్నంగా ఆయా ప్రభుత్వాలు ప్రభుత్వ పరిపాలనలలో ముఖ్య విభాగాలను పదవి విరమణ పొందిన అధికారులతో భర్తీ చేస్తూ ప్రభుత్వాలకు అనుకూలమైన నిర్ణయాలను మొలపరుచుకోవడం కోసం పదవి విరమణ పొందిన అధికారులను ప్రభుత్వ అధికార పదవులలో కొనసాగిస్తూ బాధ్యతలను మరుస్తున్నారని పేర్కొన్నారు.ఒకవైపు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదలుకొని నేటి వరకు ఊహించని అవినీతి పెరిగిపోతుందని ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యం చేయబడుతున్నాయని

- మిగతా 2లో..

## ‘సర్’ను సీరియస్ గా తీసుకోండి: కేటీఆర్

మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్

కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్‌కే మెజార్టీ వస్తుందని వెల్లడి

రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా

2



## ‘గోల్డ్ మ్యాన్’ సూర్యాభాయ్ అరెస్ట్

తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ వసూళ్లు

దాదాపు రూ. 32 లక్షలు సమర్పించుకున్న బాధితులు

డబ్బులు అడిగిన బాధితులపైనే కేసు

హైదరాబాద్ నుంచి పారిపోతుండగా షాద్‌నగర్ వద్ద అదుపులోకి



2

## ఒకే కేసులో సీఐ, ఎస్ఐ సస్పెన్షన్

అవినీతి ఆరోపణలు నిర్ధారణ..

3

## ఆ సినిమా టైటిల్ కు అర్థం ఏమిటో పవన్ కల్యాణ్ ను అడగండి: కవిత

‘ఇదుపు కాయితం’ టైటిల్‌పై రాజుకున్న వివాదం

అర్థం తెలియాలంటే పవన్‌ను అడగాలన్న కవిత

తెలంగాణ యాసను రేవంత్ రెడ్డి కాపాడటం లేదని విమర్శ

ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు

తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన

2






## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త..

జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్యమే లక్ష్యం

ఉద్యోగ దంపతుల్లో ఒకరి జీతం నుంచే కంట్రిబ్యూషన్ వసూలుకు నిర్ణయం

త్వరలోనే ఆసుపత్రుల జాబితా, ప్యాకేజీ రేట్లను ప్రకటించనున్న ప్రభుత్వం

4

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# ఆ సినిమా టైటిల్ కు అర్థం ఏమిటో పవన్ కల్యాణ్ ను అడగండి: కవిత

**'ఇడుపు కాయితం' టైటిల్‌పై రాజుకున్న వివాదం**
**అర్థం తెలియాలంటే పవన్‌ను అడగాలన్న కవిత**
**తెలంగాణ యాసను రేవంత్ రెడ్డి కాపాడటం లేదని విమర్శ**
**ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు**
**తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఇడుపు కాయితం' అనే సినిమా టైటిల్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, ఆ పదానికి అసలైన అర్థం తెలియాలంటే ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను అడగాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉప్పల్‌లో తన పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఇడుపు కాయితం' సినిమా టైటిల్‌పై సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా తీవ్ర దుమారం రేగుతోంది. ముఖ్యంగా కొందరు ఆంధ్ర నెటిజన్లు తెలంగాణ యాసను, ఈ పదాన్ని కించపరిచేలా ట్రోల్ చేస్తుండటం వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో కవిత స్పందిస్తూ, తెలంగాణ భాష, అస్తిత్వంపై దాడి జరుగుతున్నా కాంగ్రెస్, బీజేపీ, చివరికి సొంత పార్టీ బీఆర్ఎస్ కూడా మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "రాష్ట్రంలో మరోసారి ఉద్యమకాలం నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. అప్పుడు మనల్ని, మన భాషను ఎలా అయితే అవాకులు చెవాకులు పేలారో, ఇప్పుడు మళ్లీ అదే తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనమందరం ఈ విషయాన్ని గమనించుకోవాలి. నిన్నగాక మొన్న 'ఇడుపు కాయితం' అనే పేరుతో ఒక సినిమా వచ్చింది. ఈ పేరు అర్థం కావడం లేదంటూ కొందరు దానిపై ట్రోలింగ్ చేస్తున్నారు. తెలంగాణ యాసను అవమానించడమే దీని వెనుక ఉన్న ఉద్దేశం. నేను ఒకటే సూటిగా అడుగుతున్నా... 'ఇడుపు కాయితం' అంటే అర్థం తెలియకపోతే, వెళ్లి సినిమా నటుడు పవన్ కళ్యాణ్‌ను అడగండి. ఆయనకు ఆ పదం అర్థం బాగా తెలుసు, కచ్చితంగా వివరిస్తారు. మా భాషను, యాసను అవహేళన చేసినందుకే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం. ఇంకోసారి ఇటువంటి వెకిలి ప్రయత్నాలు చేయకండి. ఒకరి భాషను ఒకరం, ఒకరి సంస్కృతిని ఒకరం గౌరవించుకుందాం. అందరం కలిసే ఉందాం. కానీ, తెలంగాణను అవమానిస్తాం, మా భాషను కించపరుస్తాం అంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఈరోజు తెలంగాణ భాషను ఇంతగా కించపరుస్తున్నా కాంగ్రెస్ పార్టీ నోరు మెదపదు. ఎందుకంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేదు. ఇక బీజేపీ సంగతి సరేసరి. దేశంలోని సమస్యలు తప్ప, తెలంగాణ గురించి వారికి పట్టదు. బీఆర్ఎస్ పార్టీ కూడా మాట్లాడదు. ఎందుకంటే, అందులో ఓ గుంటనక్క ఉంది. ఆయన వ్యాపారాలన్నీ ఇప్పటికీ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారితోనే ముడిపడి ఉన్నాయి" అని ఆరోపించారు.

# 'గోల్డ్ మ్యాన్' సూర్యాభాయ్ అరెస్ట్

**తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ వసూళ్లు**
**దాదాపు రూ. 32 లక్షలు సమర్పించుకున్న బాధితులు**
**డబ్బులు అడిగిన బాధితులపైనే కేసు**
**హైదరాబాద్ నుంచి పారిపోతుండగా షాద్‌నగర్ వద్ద అదుపులోకి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు ధరిస్తూ 'గోల్డ్ మ్యాన్'గా స్థానికంగా గుర్తింపు తెచ్చుకున్న సూర్యాభాయ్ అలియాస్ పల్లపు సురేష్ కుమార్‌ను హైదరాబాద్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. విదేశాల నుంచి నాణ్యమైన బంగారాన్ని తెచ్చి మార్కెట్ ధర కంటే తక్కువకే ఇస్తానని నమ్మబలికిన సురేష్ కుమార్.. హిమాయత్ నగర్, నిలోఫర్‌కు చెందిన పలువురి నుంచి దాదాపు రూ. 32 లక్షలు వసూలు చేశాడు. నెలలు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు ఒత్తిడి చేశారు. దీంతో సెటిల్‌మెంట్ కింద కొందరికి రూ. 10 లక్షల విలువైన మూడు ఐఫోన్లు, రూ. 20 లక్షల చెక్కు ఇచ్చిన సూర్యాభాయ్.. ఆ తర్వాత మాట మార్చాడు. బాధితులే తనను బెదిరించి ఫోన్లు దొంగిలించారంటూ అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. అయితే పోలీసుల ప్రాథమిక విచారణలో సూర్యాభాయ్ చేసిన మోసం వెలుగుచూసింది. దీంతో ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కేసు నమోదైందని తెలుసుకుని హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించిన సూర్యాభాయ్‌ను పోలీసులు షాద్‌నగర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. భారీ బంగారు చైన్లు, గాజులు వేసుకుంటూ సోషల్ మీడియాలో, సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ సెలబ్రిటీలా తిరగడం సూర్యాభాయ్‌కు అలవాటు. దీంతో ఈ ఏడాది ప్రారంభంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు అతడి లైఫ్‌స్టైల్‌పై నిఘా పెట్టడంతో అతడు ధరించే నగల్లో చాలా వరకు రోల్డ్ గోల్డ్ (గిల్ట్ నగలు) అని తేలింది.

# 'సర్'ను సీరియస్ గా తీసుకోండి: కేటీఆర్

**మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్**
**కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్‌కే మెజార్టీ వస్తుందని వెల్లడి**
**రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు. మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

# రిటైర్డ్ అధికారులు రాజ్యమేలుతున్నారు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రజలంతా తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా వాళ్ల చేయాల్సిన పనులన్నీ చేసుకుంటూ ప్రభుత్వ అధికార కాల పరిమితులను దాటవేసుకుంటూ ప్రజలకు మొండి చేయి చూపిస్తున్నారని హెచ్చరించారు.పదవి విరమణ పొందిన ఏ అధికారైన అధికార హోదాలో ఫైనాన్స్ విధానాల పట్ల చెక్స్ విధానాల పట్ల ప్రభుత్వాల లావాదేవీల విధానాల పట్ల సంతకాలు చేసే హక్కులు లేనప్పటికిని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలలో వైద్య సంస్థలలో ఎక్కువగా అధికార పదవులను అనుభవిస్తున్నది పదవి విరమణ పొందిన అధికారులేనని మరొకసారి గుర్తు చేశారు.సమాజం పట్ల ప్రజల పట్ల ప్రభుత్వాల పట్ల నిజాయితీ నిబద్ధత కలిగిన అంకితభావంతో పనిచేసే అధికారులు పదవి విరమణ పొందిన ప్రభుత్వ కార్యాలయాలను ఉన్నత స్థాయిలో బలోపేతం చేయడానికి వాళ్ల వాళ్ల సేవలను పరోక్షంగా మాత్రమే ఉపయోగించుకోవడంలో తప్పేమీ లేదు గాని ప్రభుత్వ కార్యాలయాలను నిరుపయోగంగా కొనసాగించడానికి అవినీతి అక్రమాలను పెంచి పోషించడానికి దుర్మార్గమైన వ్యవస్థను నడిపించడానికి పదవి విరమణ పొందిన ఉన్నతాధికారులు తిరిగి ప్రభుత్వ కార్యాలయాల్లో అనధికార హోదాలో పదవులను అధిరోహించడం పూర్తిగా తప్పని తెలిపారు.రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి ప్రభుత్వ పరిధిలోని చట్టాలు పూర్తిగా వర్తింపజేయబడతాయని అదే విధంగా విద్యా చట్టానికి వైద్య చట్టానికి మరింత ప్రత్యేకమైన చట్టాలు ఉంటాయన్న సంగతి ప్రభుత్వాలు మర్చిపోతున్నాయన్నారు.అంతేకాకుండా చట్ట విరుద్ధమైన పనులు చేయడం కోసం ఏకంగా సచివాలయంలో కొనసాగించబడే ఉన్నతమైన స్థానాలను పదవి విరమణ పొందిన అధికారులకు కేటాయిస్తూ జీవోలు తీయడం ప్రభుత్వ చట్టాలకు ఉన్నత అధికారుల హోదాలకు చెందిన చట్టాలకు పూర్తి విరుద్ధమన్నది ప్రభుత్వాలు గమనించలేకపోతున్నాయన్నారు.కేంద్ర పరిధిలోనికి వచ్చే గ్రూప్ 1 స్థాయి నియామకాలలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ గా పదవీ విరమణ పొందిన మాజీ డిజిపిని కొనసాగించి తీవ్రమైన తప్పిదానికి పునాది చేసిందని గుర్తు చేశారు.ప్రతి సందర్భంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను మేము చేయమంటూ పదేపదే చెబుతున్న ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత శాఖలలో అవలంబిస్తున్న విధివిధానాల పట్ల తెలంగాణ ప్రజలకు తెలంగాణ సమాజానికి స్పష్టత ఇవ్వగలరా అంటూ సూటిగా అడిగారు.బాధ్యత కలిగిన నిబద్ధత కలిగిన అధికారులను సామాన్య శాఖలలో కొనసాగిస్తూ ప్రభుత్వాలకు అనుకూలంగా ప్రభుత్వాలకు సానుకూలంగా పనిచేసే అధికారులను మాత్రమే ప్రభుత్వం ముఖ్య కార్యాలయాల్లో కొనసాగిస్తూ ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు దూరం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.రాష్ట్రంలో ప్రధాన శాఖలు నిర్వీర్యం కావడానికి ప్రభుత్వాల ఏకపక్ష నిర్ణయాలే కారణమని ఏ ప్రభుత్వం ఏర్పడిన ప్రభుత్వాల ఆధ్వర్యంలో తీసుకునే సొంత నిర్ణయాలు ప్రభుత్వ శాఖలను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందన్నది వాస్తవమన్నారు.అదే సందర్భంలో ప్రభుత్వ శాఖలను కొనసాగుతున్న అధికారులు ప్రభుత్వ అధికార హోదాను అదునుగా చేసుకొని విచ్చలవిడి అవినీతికి పాల్పడుతున్నారని అలా ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిగా అవినీతిమయం కావడానికి ప్రభుత్వ పెద్దలే కారణమంటూ పరోక్షంగా హెచ్చరించారు.ప్రజలకు క్షేత్రస్థాయిలో సేవలందించగల శాఖలలో పదవి విరమణ పొందిన అధికారులను నియమిస్తూ ప్రభుత్వాలు చేస్తున్న తప్పిదమేదైతేవుందో దానివల్ల తెలంగాణ సామాన్య ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. అధికార హోదాలో ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేయాలేని ఉన్నతాధికారులు పదవి విరమణ పొందాక ప్రజలకు సేవ ఎలా చేయగలరని అధికార పదవుల్లో కొనసాగిస్తున్నారు అంటూ ప్రభుత్వాలను నిలదీశారు.ఇకనైనా తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులను తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగుల విలువలను తెలంగాణ రాష్ట్ర రైతుల ప్రయోజనాలను,తెలంగాణ రాష్ట్ర కార్మికుల హక్కులను కాపాడడం కోసం ప్రభుత్వ ముఖ్య కార్యాలయాలలో పదవీ విరమణ పొందిన అధికారులను తొలగిస్తూ చట్టాన్ని రూపొందించాలని సూచించారు.ప్రభుత్వాలకు అనుకూలమైన నిర్ణయాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ప్రభుత్వాలు భావిస్తే పేద ప్రజల అభివృద్ధి ఎందుకు జరగడం లేదంటూ సూటిగా నిలదీశారు.అధికార హోదా అనేది పెన్షన్స్ పొందుకునే పదవి విరమణ పొందిన అధికారులకు కాదని మరొక్కసారి గుర్తుచేశారు.

### నామినేటెడ్ పదవుల్లో స్పష్టత..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు పదవి విరమణ పొందాక ప్రభుత్వాలకు చెందిన సంక్షేమ కార్యాలయాలలో నామినేటెడ్ హోదాలలో కొంతమందిని అధికారులుగా నియమించుకొని ప్రభుత్వ సేవలను బలోపేతం చేయడానికి ఉపయోగించుకోవడంలో పొరపచ్చులు లేకపోవచ్చు గాని అధికార నామినేటెడ్ పదవులు కాకుండా ప్రభుత్వ స్థాయిలో కొనసాగే ప్రధాన కార్యాలయాలలో ఉన్నత శాఖలకు అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులను మంజూరు చేస్తూ నిర్ణయాలు చేయడమే చాలా తప్పని వాటన్నిటిని ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్మూలించుకుంటే గాని తెలంగాణ ప్రజలకు నిజాయితీగా సేవలు అందించబడవున్నది గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఏ ప్రభుత్వ శాఖలను చూసిన అవినీతి దోపిడిదారులు ప్రభుత్వ వ్యవస్థల మీద పడి నిరుపేదలు అడుక్కుతినే(బిక్షాటన) పరిస్థితులను అవలంబిస్తున్నట్లుగా కనిపిస్తుందని ప్రతి ప్రభుత్వ అధికారి వంతులేసుకొని అవినీతికి పాల్పడుతున్నారని అది ఎంత అవమానకరమో అలాంటి పాపాలు వాళ్ల వాళ్ల కుటుంబాలకు తరతరాలకు తగులుతుందన్న వచ్చి నిజాన్ని పసిగట్టకపోవడం అవివేకమన్నారు.కొంతమంది అధికార హోదాలను అనుభవించడం కోసం విలువలతో కూడిన అధికార పదవుల హక్కులను నాశనం చేయడం కోసం సర్వం సంపుకొని బతుకుతున్నారని అలాంటి వాళ్ళు నవారుకు పట్టిన నల్లిల లాగా ప్రభుత్వ కార్యాలయం అధికార పదవులను లాక్కొని బలవంతంగా గుంజుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రభుత్వ కార్యాలయాలను తీవ్రస్థాయిలో నిర్వీర్యం చేస్తున్నారని హెచ్చరించారు.ప్రభుత్వాలకు అనుకూలమైన కాడ నామినేటెడ్ పదవులను పెట్టుకోవచ్చు గానీ అధికారిక కార్యాలయాల్లో ప్రత్యక్ష అధికార హోదాలను పదవి విరమణ పొందిన అధికారులను పెట్టుకొని ప్రభుత్వ విలువలను ప్రజాస్వామ్య విలువలను ప్రభుత్వ చట్టాల విలువలను దిగజార్చకూడదని గుర్తుచేశారు. ఏ ప్రభుత్వమైన అసెంబ్లీలలో నీతులు వల్లించడానికి సరిపోతుంది తప్ప కార్యాచరణలో మాత్రం కానరాని దుర్మార్గమైన పనులను పెంచి పోషిస్తున్నారని వాటి వల్ల తెలంగాణ ప్రజల భవిష్యత్తే కాకుండా తెలంగాణ పరిరక్షణ హక్కులు పూర్తిగా నశించిపోతున్నాయన్నది ఎవరు నమ్మిన ఎవరు నమ్మకపోయినా పచ్చి నిజమన్నారు.

**అనధికార హోదాల తీరుపై విశ్లేషణ.. రిటైర్డ్ అధికారులకే పెద్దపీట..!**

### ప్రభుత్వాలు మారినా.. సలహాదారుల నియామకాల ఆనవాయితీ మాత్రం యథాతథం

తెలంగాణలో ప్రభుత్వాలు మారుతున్నా, పదవీ విరమణ చేసిన ఉన్నత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ప్రభుత్వ సలహాదారులుగా నియమించే సంప్రదాయం మాత్రం కొనసాగుతోంది. ముఖ్యంగా మాజీ చీఫ్ సెక్రటరీలు (సీఎస్‌లు), మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీలు) కీలక పదవులు చేపట్టడం రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో ఒక స్థిరమైన ధోరణిగా మారింది. తాజాగా పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రి సలహాదారుగా, ఎక్స్-ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఈ అంశంపై మరోసారి చర్చకు దారితీసింది.

### బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన విధానం

తెలంగాణ ఆవిర్భావం తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలనా అనుభవాన్ని వినియోగించుకోవాలనే ఉద్దేశంతో పలువురు రిటైర్డ్ ఉన్నతాధికారులకు కీలక బాధ్యతలు అప్పగించింది. మాజీ సీఎస్‌లు రాజీవ్ శర్మ, సోమేశ్ కుమార్, మాజీ డీజీపీ అనురాగ్ శర్మ, మాజీ ఐపీఎస్ అధికారి ఏ.కే. ఖాన్ తదితరులను ప్రభుత్వ సలహాదారులుగా నియమించింది.

### అధికారంలోకి రాగానే తొలగింపులు

2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించిన పలువురు సలహాదారులను తొలగించింది. అప్పట్లో "అవసరానికి మించి సలహాదారుల నియామకాలు" అంటూ కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. మాజీ సీఎస్‌లు రాజీవ్ శర్మ, సోమేశ్ కుమార్, మాజీ డీజీపీ అనురాగ్ శర్మ సహా పలువురి నియామకాలను రద్దు చేసింది.

### ఇప్పుడు అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం

అయితే రెండున్నరేళ్ల వ్యవధిలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. రిటైర్డ్ డీజీపీ మహేందర్ రెడ్డికి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బాధ్యతలు అప్పగించగా, మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డిని రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది. మాజీ సీఎస్ శాంతికుమారికి ఎంసీహెచ్‌ఆర్డీ వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ జనరల్ బాధ్యతలు అప్పగించింది. తాజాగా సీఎస్ కె. రామకృష్ణారావుకు సీఎం సలహాదారు పదవి ఇవ్వడం ఈ ధోరణి కొనసాగుతున్నట్లు స్పష్టం చేస్తోంది.

### ఎందుకు రిటైర్డ్ అధికారులకే ప్రాధాన్యం?

ప్రభుత్వ వర్గాల అభిప్రాయం ప్రకారం, దీర్ఘకాల పరిపాలనా అనుభవం, కేంద్ర-రాష్ట్ర సమన్వయం, శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం, విధాన నిర్ణయాల్లో నైపుణ్యం, ముఖ్యమంత్రికి ప్రత్యక్షంగా సలహాలు అందించే సామర్థ్యం వంటి అంశాల కారణంగా రిటైర్డ్ ఉన్నతాధికారులను ప్రభుత్వం వినియోగించుకుంటోందని చెబుతోంది.

### విమర్శలు కూడా అదే స్థాయిలో

మరోవైపు ప్రతిపక్షాలు మాత్రం ఈ నియామకాలను "రిహాబిలిటేషన్ పోస్టులు"గా అభివర్ణిస్తున్నాయి. సేవలో ఉన్న అధికారుల నిర్ణయ స్వాతంత్ర్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని మాజీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. నిపుణులకు అవకాశం ఇవ్వకుండా పదవీ విరమణ చేసిన అధికారులకే వరుసగా బాధ్యతలు అప్పగించడం సరైందా అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది.

### స్పష్టమైన విధానం అవసరం

సలహాదారుల నియామకాలకు సంబంధించి బాధ్యతలు, విధులు, కాలపరిమితి, పనితీరు మూల్యాంకనం వంటి అంశాలపై ప్రభుత్వం పారదర్శక విధానాన్ని రూపొందించాలని పరిపాలనా నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి వ్యవస్థ ఉంటే విమర్శలకు తావు తగ్గి, నియామకాలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, తెలంగాణలో ప్రభుత్వం మారినా రిటైర్డ్ ఉన్నతాధికారులకు కీలక బాధ్యతలు అప్పగించే సంప్రదాయం మాత్రం కొనసాగుతూనే ఉందనే అభిప్రాయం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# కాజీపేటలో భారీగా గంజాయి పట్టివేత.. ఇద్దరు అరెస్ట్

**కాజీపేట, 28 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కాజీపేట పోలీసుల అప్రమత్తతతో భారీగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 1 కేజీ 400 గ్రాముల ఎండు గంజాయితో పాటు ఒక ఆటో, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన పెట్రోలింగ్ సందర్భంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, పై అధికారుల ఆదేశాల మేరకు కాజీపేట ఉమెన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్. మౌనిక తన సిబ్బందితో కలిసి ప్రభుత్వ వాహనంలో కాజీపేట ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో కడిపికొండ బ్రిడ్జి కింద ప్లాస్టిక్ కవర్‌తో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించారు. పోలీసులు సమీపించగానే వారు పారిపోవడానికి ప్రయత్నించగా, అప్రమత్తమైన సిబ్బంది వెంటాడి వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో కడిపికొండకు చెందిన బొల్ల ప్రవీణ్ కుమార్ (32), కాజీపేటకు చెందిన ఆటో డ్రైవర్ మొహమ్మద్ అఫ్జల్ పాషా (28) ఉన్నారు. ఈ కేసులో మరో నిందితుడు ఎండి సల్మాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో నిందితులు మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, కాజీపేట ప్రాంతంలో అధిక ధరకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. రూ.10 వేలతో కొనుగోలు చేసిన 1 కేజీ 400 గ్రాముల గంజాయిని సుమారు రూ.70 వేల వరకు విక్రయించేందుకు ఆటో నంబర్ టిఎస్03యుడి 4914లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.70 వేల విలువైన 1.4 కిలోల ఎండు గంజాయి, బజాజ్ ఆటో, రెడ్‌మి 13 ప్రో, ఒప్పో ఎ96 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ పంచుల సమక్షంలో గంజాయిని తూకం వేసి చట్టపరమైన నిబంధనల ప్రకారం సీజ్ చేశారు. నిందితులపై కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 164/2026గా ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సి), 20(బి)(ఐఐ)(బి), 27 కింద కేసు నమోదు చేసి, ఎస్ఐ బి. శివ దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలను హెచ్చరిస్తూ, గంజాయిని కలిగి ఉండడం, రవాణా చేయడం, విక్రయించడం లేదా వినియోగించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం





**మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**వరంగల్, 28 జూన్ 2026(జి భీమ్ న్యూస్)**

2030 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారత కోసం విస్తృత కార్యక్రమాలు అమలు చేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మహిళలు స్వయం ఉపాధి, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో మరింతగా రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వరంగల్ మహానగర పాలక సంస్థ, మేప్మా సంయుక్త ఆధ్వర్యంలో గీసుగొండ మండలం కొనయమాకుల గ్రామంలోని పీడీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహాత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి ఎమ్మెల్యే మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరకాల మహిళా డెయిరీ ద్వారా మహిళలకు శాశ్వత ఆదాయ వనరులు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే డెయిరీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని, మహిళా సంఘాల కోసం ప్రత్యేక సమాఖ్య భవనం నిర్మాణానికి స్థల సేకరణతో పాటు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మహిళల సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. యువతులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు టెక్స్టైల్ రంగంలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి 18 నుంచి 35 సంవత్సరాల మహిళలకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 600 మందికి ఉపాధి కల్పించగా, మరో 1,400 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందని, భవిష్యత్తులో సుమారు 2,800 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ నాణ్యమైన విద్య, యూనిఫారాలు, పౌష్టికాహారం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థ నాణ్యతకు నిదర్శనమని అన్నారు. జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి మాట్లాడుతూ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2.38 లక్షల మంది అర్హులైన మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్హ మహిళ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ మహిళల పట్ల ప్రభుత్వ గౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రతి అర్హ మహిళకు నాణ్యమైన చీర అందేలా పారదర్శకంగా పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్, ఉప కమిషనర్ సమ్మయ్య, మేప్మా డీఆర్‌ఎం రేణుక, టీఎంసీ రమేష్, మేప్మా అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే కేసులో సీఐ, ఎస్ఐ సస్పెన్షన్

**అవినీతి ఆరోపణలు నిర్ధారణ..**
**ఇద్దరు పోలీసు అధికారులపై క్రమశిక్షణా చర్యలు**
**ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, 28 జూన్ 2026 ( జై భీమ్ క్రైమ్ న్యూస్ )**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఒకే కేసుకు సంబంధించి ఇద్దరు పోలీసు అధికారులపై ఒకేసారి సస్పెన్షన్ వేటు పడింది. అవినీతి ఆరోపణలు నిర్ధారణ కావడంతో వెస్ట్ జోన్ పరిధిలోని నర్మెట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. అబ్బయ్యతో పాటు, గతంలో బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్)కు అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎస్ఐ షేక్ హమీద్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అవినీతి ఆరోపణలపై శాఖాపరంగా విచారణ నిర్వహించినట్లు తెలిసింది. విచారణలో ఇద్దరు అధికారులపై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సస్పెన్షన్‌కు గురైన సీఐ ఎం. అబ్బయ్య ప్రస్తుతం నర్మెట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా, ఎస్ఐ షేక్ హమీద్ గతంలో బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో పనిచేసి ప్రస్తుతం ఆర్మ్డ్ రిజర్వ్ విభాగానికి అటాచ్ అయ్యారు. ఒకే కేసులో ఇద్దరు అధికారులపై ఏకకాలంలో సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం పోలీస్ కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది. పోలీసు శాఖలో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే అవినీతి, అక్రమాలకు ఏమాత్రం తావులేదనే స్పష్టమైన సందేశాన్ని ఈ చర్య ద్వారా శాఖ ఉన్నతాధికారులు ఇచ్చినట్లు భావిస్తున్నారు. విధి నిర్వహణలో అవినీతి లేదా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై హోదాతో సంబంధం లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసు శాఖ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. ఈ తాజా సస్పెన్షన్ చర్యతో పోలీసు శాఖలో క్రమశిక్షణ మరింత బలోపేతం అవుతుందని, విధుల్లో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారశైలికి ఇది దోహదపడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.




# జర్మనీ, స్విట్జర్లాండ్ అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనకు ఎంపికైన డా. డి. సురేష్ బాబు

**హన్మకొండ, 28 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనకు హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) కంప్యూటర్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, విభాగాధిపతి, అంతర్గత నాణ్యత హామీ విభాగం (ఐక్యూఏసీ) సమన్వయకర్త డాక్టర్ డి. సురేష్ బాబు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, కళాశాల విద్యా కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక విద్యా పర్యటనకు ఆయన ఎంపిక కావడం పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు. ఈ విద్యా పర్యటనలో భాగంగా డాక్టర్ సురేష్ బాబు జూన్ 28 నుంచి జూలై 6 వరకు జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలను సందర్శించి అక్కడ అమలవుతున్న ప్రపంచ స్థాయి ఉన్నత విద్యా విధానాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమలు -- విద్యాసంస్థల భాగస్వామ్యం, పరిశోధనలో అనుసరిస్తున్న ఆధునిక విధానాలు, వినూత్న బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలను అధ్యయనం చేయనున్నారు. అలాగే అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో విద్యా, పరిశోధనా రంగాల్లో సహకారాన్ని పెంపొందించేందుకు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశాలను కూడా పరిశీలించనున్నారు. ఈ పర్యటన ద్వారా లభించే అనుభవాలు తెలంగాణలో ఉన్నత విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నాణ్యమైన బోధన, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి ఆధారిత విద్యా కార్యక్రమాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. డాక్టర్ సురేష్ బాబు అంతర్జాతీయ స్థాయి విద్యా అనుభవాన్ని సొంతం చేసుకుని విద్యార్థులు, అధ్యాపకులకు మరింత ఉపయోగపడే విధంగా సేవలందిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ ఎం. అరుణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది డాక్టర్ డి. సురేష్ బాబుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన విద్యా అధ్యయన పర్యటన విజయవంతంగా సాగి కళాశాలకు, రాష్ట్ర ఉన్నత విద్యారంగానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# "నిండు ప్రాణానికి రెండు చుక్కలు".. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

**జిల్లాలో 84,301 మంది చిన్నారులకు పల్స్ పోలియో వ్యాక్సిన్ లక్ష్యం**
**కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి**



**హన్మకొండ, 28 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, జననం నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (మిషన్ ఆసుపత్రి)లో వారు సంయుక్తంగా ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, "నిండు ప్రాణానికి రెండు చుక్కలు" అనే నినాదంతో జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని విజ్ఞప్తి చేశారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అందరూ సహకరించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి మాట్లాడుతూ, జిల్లాలోని 0 నుంచి 5 సంవత్సరాల మధ్య వయస్సు గల 84,301 మంది చిన్నారులకు పల్స్ పోలియో వ్యాక్సిన్ అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందుకోసం 460 పోలియో బూత్‌లు, 27 మొబైల్ బృందాలు, 12 ట్రాన్సిట్ బృందాలు, 27 పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు కార్యక్రమ నిర్వహణ కోసం 1,804 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో చిన్నారులకు వ్యాక్సిన్ అందించడంతో పాటు, జూన్ 29, 30 తేదీల్లో మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోలేని చిన్నారులను గుర్తించి ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ అందజేస్తామని తెలిపారు. పోలియో నిర్మూలనలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో కీలకమని, ఐదేళ్లలోపు ఏ చిన్నారి కూడా వ్యాక్సిన్‌కు దూరం కాకుండా చూడాలని కోరారు. ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారామ్ కుమార్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, స్టేట్ రెడ్‌క్రాస్ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి. మదన్ మోహన్ రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, ఆర్ఎంఓ డాక్టర్ మంజుల, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ నరేష్, డాక్టర్ మానస, డాక్టర్ అనిల్, డాక్టర్ గీత, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూలై 2న ఉద్యమకారుల భూ పోరాటాన్ని విజయవంతం చేయాలి: డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్



**మహబూబాబాద్, 28 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్న భూ పోరాటానికి ఉద్యమకారులు, తెలంగాణవాదులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్ర అధికార ప్రతినిధి, మానుకోట జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో ప్రతి గ్రామం ఉద్యమ కేంద్రంగా మారిందని, వేలాది మంది ఉద్యమకారులు వంటావార్పులు, రిలే నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, ధూం-ధాం కార్యక్రమాల ద్వారా ఉద్యమాన్ని విజయవంతం చేశారని గుర్తు చేశారు. అయితే రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు గడిచినా అనేక మంది ఉద్యమకారులు ఇప్పటికీ తగిన గుర్తింపు, సంక్షేమ ఫలితాలు పొందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ పార్టీగా చెప్పుకున్న గత ప్రభుత్వం ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కూడా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఇల్లు నిర్మాణానికి అవసరమైన సహాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో వివిధ ఉద్యమ సంఘాలు పార్టీలకు అతీతంగా ఏకమై ఉద్యమకారుల హక్కుల సాధన కోసం జూలై 2న ఉప్పల్ భగాయత్‌లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిలో భూ పోరాటానికి సిద్ధమయ్యాయని తెలిపారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించడం, ఉద్యమకారులకు పెన్షన్ మంజూరు చేయడం, గుర్తింపు కార్డులు జారీ చేయడం వంటి ప్రధాన డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మానుకోట జిల్లా తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, ఉద్యమ సమయంలో సీమాంధ్ర నాయకులను అడ్డుకుని పోరాట స్ఫూర్తిని చాటిన ఈ నేలపై ఉన్న ఉద్యమకారులు, ప్రజలు పార్టీలకు అతీతంగా ఏకమై జూలై 2న జరిగే భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు.

# చింతల్‌లో 'అల్-షిఫా' క్లినిక్ ప్రారంభం

**ప్రారంభించిన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ**

**వరంగల్, 28 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని చింతల్ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అల్-షిఫా క్లినిక్‌ను ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ ఆదివారం ప్రారంభించారు. డా. మహ్మద్ రహీముద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్లినిక్‌ను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో డా. మహ్మద్ రహీముద్దీన్ క్లినిక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. "సేవ -- చికిత్స -- కరుణ" అనే భావనతో సేవలు అందించనున్న ఈ క్లినిక్ ప్రజల ఆరోగ్య సంరక్షణలో విశేష పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అల్-షిఫా క్లినిక్‌లో ప్రథమ చికిత్స సేవలతో పాటు ఇంటి వద్ద నర్సింగ్ సేవలు కూడా అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలను అందుబాటు ఖర్చుతో ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వైద్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని డా. మహ్మద్ రహీముద్దీన్‌కు అభినందనలు తెలియజేసి, క్లినిక్ విజయవంతంగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.



## సమిష్టి కృషితో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలి.

**ఉన్నత స్థాయిలో హోలీ కార్యక్రమాన్ని నమోదు చేయించాలి.**
**చిన్నపిల్లల ఆరోగ్యాలు మెరుగ్గా ఉండడానికి పోలియో చుక్కలు దోహదపడగలవు.**
**రాష్ట్రమంతటా పోలియో చుక్కల కార్యక్రమం అద్భుతమైన కార్యక్రమం.**
**పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత : డాక్టర్ అనితా రెడ్డి**





**హన్మకొండ జై బీమ్ న్యూస్:-**

ఆదివారం బాలసముద్రం, వడ్డెర బస్తి పోలియో సెంటర్స్ లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించిన అనురాగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ నిండు ప్రాణానికి రెండు చుక్కలు' ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జననం నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపు నిచ్చారు. నిండు ప్రాణానికి రెండు చుక్కలు" అనే నినాదంతో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని పోలియో నిర్మూలన లో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని ఐదేళ్లలోపు పిల్లలంద రికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని, పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమిష్టి కృషి తో ప్రజలందరూ విజయ వంతం చేయాలని, సమీప పోలియో కేంద్రానికి తమ చిన్నారు లను తీసుకువచ్చి రెండు పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డాక్టర్ అనితా రెడ్డి కోరారు.డాక్టర్ అనితా రెడ్డి అనురాగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు.

## జయగిరిలో పేకాట గుట్టురట్టు.. ఐదుగురు అరెస్ట్.. నగదు, బైక్‌లు స్వాధీనం

**జయగిరి శివార్లలో పేకాట స్థావరంపై హసన్‌పర్తి పోలీసుల మెరుపు దాడి**




**హన్మకొండ జిల్లా/హసన్‌పర్తి, 28 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీసుల మెరుపు దాడిలో జయగిరి గ్రామ శివార్లలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు పోలీసుల వలలో చిక్కారు. వారి వద్ద నుంచి నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, జయగిరి గ్రామ శివార్లలో కొందరు వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో పేకాట నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఆకస్మికంగా దాడులు నిర్వహించింది. ఈ దాడిలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో కుమార్ (41), రాజ్‌కుమార్ (31), సంపత్ (39), సుభాష్ గౌడ్ (51), రాజ్‌కుమార్ (52) ఉన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.6,980 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే పేకాట, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎక్కడైనా జూదం, పేకాట లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పిడుగుపాటుకు 11 మేకలు మృతి దారుర్ మండలంలో విషాదం



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దారుర్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఆదివారం కురిసిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి, గ్రామానికి చెందిన రైతు కంది భీమయ్యకు చెందిన 11 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుడైన రైతు భీమయ్య తన మేకలను మేతకు తీసుకెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. చనిపోయిన మేకల విలువ సుమారు రూ. 1,80,000వేల వరకు ఉంటుందని, తన జీవనాధారం కోల్పోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నష్టాన్ని అంచనా వేసి తమను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు భీమయ్య కోరుతున్నారు.

## పాల సంగం డైరెక్టర్ గా బీఆరెస్ మద్దతు దారు గొల్ల శాంతమ్మ




**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలోని పాల సంగం డైరెక్టర్ గా బీఆరెస్ మద్దతు దారు గొల్ల శాంతమ్మ ఎన్నికయ్యారు. ఆదివారం రెండు డైరెక్టర్ పోస్టులకు సంగం సభ్యులంతా ఏకగ్రీవం కోసం ప్రతిపాదించిగా బీఆర్ఎస్ నుంచి శాంతమ్మ ఎన్నికయారు. డైరెక్టర్ గా ఎన్నికైన శాంతమ్మ ను దోమ మాజీ సర్పంచ్ కె రాజిరెడ్డి మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య పార్టీ అధ్యక్షులు గోపాల్ డైరెక్టర్ గొల్ల పెంటయ్య గొల్ల శ్రీనివాస్ రాములు తదితరులు పాల్గొని శాలువా తో సన్మానం చేసారు.

## మల్లన్న ఆలయంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ప్రముఖ శైవక్షేత్రం ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దంపతులు,మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు అన్నదానానికి విరాళం అందించారు. ప్రతి ఆదివారం సుమారు వంద మంది భక్తులకు అన్నదానం చేయడం జరుగుతుందని దేవాలయ ఈవో సుధాకర్ తెలిపారు. అనంతరం ఐనవోలు గ్రామంలోని నంది సెంటర్ వద్ద దేవాలయ దాతలచే ఆర్చి నిర్మాణం చేయుటకు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో కందుల సుధాకర్ చైర్మన్ కమ్మగొని ప్రభాకర్,ధర్మకర్తల మండలి సభ్యులు,గ్రామ సర్పంచ్ గడ్డం రఘువంశీ,ఉప సర్పంచ్ బరిగెల భాస్కర్,ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్ అయినవోలు మధుకర్ శర్మ అర్చకులు నందనం మధు శర్మ పాతర్లపాటి నరేష్ శర్మ ఒగ్గు పూజారులు మజ్జిగ అశోక్,మజ్జిగ రాజయ్య మరియు అర్చక సిబ్బంది పాల్గొన్నారు



## కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టిన కడ్లాపూర్ భూబాధిత రైతులు



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా పరిగి మండల కేంద్రంలో శుక్రవారం రోజు కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతుంటే, పరిగి ఎమ్మెల్యే దౌర్జన్యంగా మా భూములు తీసుకుంటూ మాకు చేస్తున్న ద్రోహాన్ని కేటీఆర్ కు చెప్పుకునేందుకు మా కాడ్లాపూర్, రాపోల్ గ్రామాలకు మేమందరము ఒక్కసారిగా లేచి కేటీఆర్ దగ్గరికి వెళుతుంటే ఆగండి ఎందుకు లేస్తున్నారు ఎక్కడ పోతున్నారు ఆగం కాకండి, కార్యక్రమం పూర్తయిన తర్వాత స్వయంగా నేనే మీ దగ్గరికి వచ్చి మీ సమస్యలు తెలుసుకుంటా ఆగండి అని చెప్పిండు. దానికి పరిగి ఎమ్మెల్యే ఓ సమావేశంలో కేటీఆర్ సభ ఫ్లాపు ఫంక్షన్ హాల్లో జనాలే లేరు అని చెప్తున్నారు. మామూలుగా ఓ చిన్నపాటి కార్యకర్తల సమావేశం పెడితేనే 5000 మందికి పైగా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేశారు. అదే పరిగిలో ఓ బహిరంగ సభ ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆ పార్టీ పరిస్థితి ఏంటో గుర్తించుకోవాలని.. స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త..

**జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం**
**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్యమే లక్ష్యం**
**ఉద్యోగ దంపతుల్లో ఒకరి జీతం నుంచే కంట్రిబ్యూషన్ వసూలుకు నిర్ణయం**
**త్వరలోనే ఆసుపత్రుల జాబితా, ప్యాకేజీ రేట్లను ప్రకటించనున్న ప్రభుత్వం**




**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, క్రమబద్ధమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జూలై 15న ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో పథకం ప్రారంభ తేదీని ఖరారు చేశారు. వారం రోజుల్లోగా వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలతో ట్రస్ట్ సభ్యులు కీలక భేటీ నిర్వహించనున్నారు. ఆ తర్వాత నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలు, చికిత్సల ప్యాకేజీ ధరలు, ఎంప్యానెల్ చేసిన ఆసుపత్రుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో, వారిలో ఒకరి వేతనం నుంచి మాత్రమే హెల్త్ కంట్రిబ్యూషన్‌ను మినహాయించనున్నారు. ఈ నిర్ణయం వల్ల అటువంటి ఉద్యోగ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో పూర్తి పారదర్శకతను నిర్ధారిస్తూ, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకంగా 'ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ట్రస్ట్ పర్యవేక్షణలోనే నూతన ఆరోగ్య పథకం అమలు కానుంది.